సాక్షి శ్రీకాకుళం

శనివారం : 20 : మే : 2023



సమన్వయంతోనే సంక్షేమం

జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు అర్థవంతంగా జరిగాయి. పలు సమస్యలపై సమీక్ష నిర్వహించారు. - 10లో



ప్రత్యామ్నాయ పంటలు..

మంత్రి ధర్మాన అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. నీటి పారుదలపై కూడా చర్చించారు. - 10లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35°	27°
ఇచ్ఛాపురం	35°	27°
పాతపట్నం	35°	26°
శ్రీకాకుళం	35°	26°

న్యూస్‌రీల్

పిడుగుపడి యువకుడు మృతి



పిడుగుపాటు గురై మృతి చెందిన ప్రశాంత్ దొళాయి

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి లండపుట్టుగ గ్రామానికి చెందిన ప్రశాంత్ దొళాయి(20) శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. తోటి యువకులతో కలిసి గ్రామానికి దూరంగా ఉన్న చెరువు గ్రౌండ్‌లో ప్రశాంత్ క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. వర్షం పడడంతో అంతా ఇళ్లకు పరుగు పెట్టారు. అయితే ప్రశాంత్ ఎవరూ లేని ప్రదేశంలో ఉండగా అమాంతం అతనిపైనే పిడుగు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ యువకుడు విజయనగరంలో బీఎస్సీ డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులకు స్వగ్రామానికి వచ్చాడు. ప్రశాంత్ తల్లిదండ్రులు ఖెత్రో దొలాయి, జొరా దొలాయిలకు ఇతను ఒక్కడే మగ సంతానం. ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి. ప్రశాంత్ మృతితో తల్లిదండ్రులకు ఆధారం లేకుండాపోయింది. పైగా మృతుని తల్లి జొరా దొలాయి కిడ్నీ వ్యాధి బాధితురాలు. ప్రతి వారం సోంపేట వెళ్లి డయాలసిస్ చేయించుకుంటారు. ఇప్పుడు ఈ విషాద వార్త విని వారు తల్లడిల్లిపోయారు. స్థానిక సర్పంచ్ డాక్టర్ జగబంధు దొలాయి పర్యవేక్షణలో మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

జిల్లా అదనపు ఎస్పీగా తిప్పేస్వామి



జె.తిప్పేస్వామి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖలో అడ్మిన్ విభాగానికి అదనపు సూపరింటెంట్ ఆఫ్ పోలీస్‌గా జె.తిప్పేస్వామి నియమితులయ్యారు. పదోన్నతిపై ఆయన ఇక్కడకు వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకు చిత్తూరు ట్రాఫిక్ డీఎస్పీగా తిప్పేస్వామి పనిచేశారు. శ్రీకాకుళం జిల్లా డీటీసీ డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న గుంటుపల్లి శ్రీనివాసరావు పదోన్నతిపై విశాఖ ట్రాఫిక్ ఏడీసీపీగా పోస్టింగ్ లభించింది.

ఎంపీసీ స్ట్రీం ఇంజినీరింగ్ పరీక్షకు 5315 మంది హాజరు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీఈఏపీ సెట్‌లో భాగంగా శుక్రవారం ఎంపీసీ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని టెక్కలి ఐతం, చిలకపాలెం శ్రీశివానీ, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలు కేంద్రాలు పరీక్ష నిర్వహించారు. ఈ నెల 15న ప్రారంభమైన పరీక్ష తొమ్మిది షిఫ్టులుగా శుక్రవారం వరకు కొనసాగింది. శుక్రవారం ఒక్క షిఫ్టు మాత్రమే నిర్వహించారు. జిల్లా నుంచి ఇంజినీరింగ్‌కు 5517 మంది దరఖాస్తు చేసుకోగా, 5318 మంది హాజరయ్యారు. 96.39 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. చివరి రోజు శ్రీ వెంకటేశ్వరలో 190 మందికి 185 మంది, చిలకపాలెం శ్రీ శివానీలో 190కి 185, టెక్కలి ఐతంలో 256కి 244 మంది విద్యార్థులు హాజరయ్యారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకే శిక్షణ



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ భారతమ్మ

గార: విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు శిక్షణ ఉపయోగపడుతుందని డైట్ ప్రిన్సిపాల్ ఎం.భారతమ్మ అన్నారు. వమరవల్లి ప్రభుత్వ డైట్‌లో గత ఐదు రోజులుగా నిర్వహించిన డీఎస్సీ–98, 2008 ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విద్యార్థులకు బోధించాలన్నారు. కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ అప్పన్న, రిసోర్సు పర్సన్లు ఎస్పీ అనితారాణి, పీవీఎస్ఎన్ మూర్తి, సూర్యనారాయణ, పాపాచారి పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

మందస: మండలంలోని పిడిమందస గ్రామానికి చెందిన అరసవెల్లి సంతోష్‌కుమార్(34) శుక్రవారం రైలు ఢీకొని మరణించాడు. వృత్తి రీత్యా కార్పెంటర్‌గా పని చేస్తున్న సంతోష్‌కుమార్.. పని చేయడానికి అల్లిమెరక వైపు వెళ్లడానికి మఖరజోల గ్రామం వద్ద పట్టాలు దాటుతుండగా.. పలాస నుంచి బరంపురం వెళ్తున్న యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్ట్ ట్రైన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సంతోష్‌కుమార్ అక్కడికక్కడే మరణించాడు. సమాచారం తెలుసుకున్న పలాస రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుని భార్య పావనిప్రియ, కుమారుడు విజయ్, కుమార్తె ఉషశ్రీలు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. మృతదేహాన్ని పలాస సీహెచ్‌సీకి తరలించారు.







గాలి దుమారం

జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం రాకాసి గాలి దుమారం రేపింది. సాయంత్రం సమయంలో అకస్మాత్తుగా వీచిన ఈదురుగాలులు అందరినీ భయపెట్టాయి. కొన్ని చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడగా.. మరికొన్ని చోట్ల చెట్లకు చెట్లు పడిపోతాయేమో అన్నంతగా ఊగిపోయాయి. జల్లులు మాత్రం ఉపశమనం కలిగించాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

గిరికి ప్రగతి దారి



నాడు: కొత్తూరు మండలం గూనభద్ర పంచాయతీ కంఠమానుగుడ గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి దుస్థితి ఇది. ఆ గ్రామం నుంచి రాకపోకలు సాగించాలంటే గిరిజనులు అష్టకష్టాలు పడేవారు. ఎవరికైనా రోగం వస్తే మరింత దయనీయంగా ఉండేది. రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.





నేడు: కొత్తూరు మండలం గూనభద్ర పంచాయతీ కంఠమానుగుడ గిరిజన గ్రామానికి వెళ్లేందుకు కొత్తగా వేసిన సీసీ రోడ్డు ఇది. ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో రూ. 21లక్షలు వెచ్చించి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేసిన రోడ్డు. ఇప్పుడా గిరిజన గ్రామానికి రహదారి కష్టాలు తీరాయి. నేరుగా వాహనాలు అక్కడికి వెళ్తున్న పరిస్థితి ఇప్పుడుంది.

- జిల్లాలో గిరిసీమలకు పక్కా రహదారులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గిరిజన గ్రామాలకు మోక్షం
- రూ.56.35కోట్లతో సీసీ, బీటీ రోడ్లు
- 102 గ్రామాలకు ఉపయోగపడేలా 42 రోడ్లు వేసిన సర్కారు



నాడు : కొత్తూరు మండలం అబలాసింగి గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి గతంలో ఇలా ఉండేది. అది కూడా కొంతవరకే. చాలా వరకు ఈ రకంగా కూడా రహదారి లేని పరిస్థితి. ఆ గ్రామానికి గిరిజనులు నరకయాతన అనుభవించారు.



నేడు : కొత్తూరు మండలం అబలాసింగి గిరిజన గ్రామానికి కొత్తగా వేసిన రోడ్డు ఇది. ఇప్పుడీ గ్రామానికి రహదారి కష్టాలు తీరాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆధ్వర్యంలో రహదారికి నిధులు మంజూరు చేశారు. నేరుగా వాహనాలు ఆ గ్రామానికి వెళ్లిపోతున్నాయి.

సాక్షి ప్రతినిధి,శ్రీకాకుళం : విమానాలపై మనిషి గుండె, కిడ్నీ, లివర్ తరలించి రోగులకు అమర్చుతున్నారు. ఒకేసారి పదుల సంఖ్యలో ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించే మేధావులను ఎన్నో ఏళ్లుగా చూస్తున్నాం. కానీ, అమాయకులైన గిరిజనుల కష్టాలు తీర్చే నాథుడు మాత్రం కనిపించలేదు. చంద్రన్న రోడ్లు, ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ రోడ్లు అంటూ హడావుడి చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఏం చేసిందో ఎవరికీ తెలియని పరిస్థితి. రహదారుల్లేక గిరిజనులు పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వైద్యంకోసమైతే అగ్రులు చాసిన దుస్థితి ఉండేది. మందుబిళ్లలు అందే పరిస్థితి కూడా ఉండేది కాదు. ఇలాంటి సన్నివేశాలు గిరిజన గూడల్లో నిత్యకృత్యంగా మారిన పరిస్థితి ఉండేది. ఇప్పుడా గ్రామాల కష్టాలు తీర్చే పనిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిమగ్నమైంది. గిరిజన గూడలకు రోడ్లు వేసే బాధ్యతను జగన్ ప్రభుత్వం తీసుకుంది.

వైఎస్సార్‌సీపీ వచ్చాక..

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లాలో 102 గిరిజన గ్రామాలకు ఉపయోగపడేలా 42 సీసీ రోడ్లు వేసేందుకు రూ.56.35కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడా పనులు చాలావరకు పూర్తయ్యాయి. కొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, మెళియాపుట్టి, ఎల్ఎన్‌పేట, హిరమండలంలో 27 గిరిజన గ్రామాలకు ఉపయోగపడే విధంగా రూ.20కోట్లతో 14 రోడ్లు మంజూరు చేశారు. వాటిలో 11 రోడ్లు పూర్తయ్యాయి. మరో మూడు ప్రగతి దశలో ఉన్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కంచిలి, సోంపేట మండలాల్లోని 28గ్రామాలకు ఉపయోగపడేలా రూ.16.60కోట్లతో 10రోడ్లు మంజూరు చేశారు. పలాస నియోజకవర్గంలో పలాస, మందస మండలాల్లోని 47గిరిజన గ్రామాలకు ఉపయోగపడేలా రూ.19.75కోట్లతో 18రోడ్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఆ రోడ్ల పనులన్నీ పూర్తయ్యాయి. దీంతో ఇప్పుడా గిరిజన గ్రామాల కష్టాలు చాలా వరకు తీరాయి. వైద్యం, ఇతరత్రా సదుపాయాలు సకాలంలో అందుతున్నాయి.

సకాలంలో వైద్యం అందుతోంది..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే రెడ్డి శాంతి కృషి మేరకు మహసింగిగూడ నుంచి కంఠమానుగూడ వరకు రోడ్డు బాగు చేయడంతో సకాలంలో గిరిజనులకు వైద్యం అందుతోంది. మట్టి రోడ్డు వల్ల వర్షాకాలం వాహనాలు వచ్చేవి కావు. దీంతో వైద్య సమస్యలుండేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాలకు రోడ్లు బాగు చేయడంతో గిరిజనులకు మేలు జరుగుతోంది.

– సవర నరసయ్య, కంఠమానుగూడ, కొత్తూరు మండలం

సంక్షేమ వారధులు.. ప్రగతికి సారథులు

- సత్కారాలకు వలంటీర్లు అర్హులు: మంత్రి ధర్మాన
- ఘనంగా వలంటీర్లకు వందనం కార్యక్రమం



వలంటీర్లను సత్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు. చిత్రంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

అరసవల్లి: రాష్ట్రంలో 2019లో ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని, ఈ వ్యవస్థల వల్లనే ప్రభుత్వానికి మంచి పేరు, గుర్తింపు వచ్చాయని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ప్రశంసించారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం బాపూజీ కళామందిర్‌లో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహించగా, మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లను సత్కరించారు. అంతకుముందు ధర్మాన మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ల పనితీరు ఎన్నటికీ మరచిపోలేమని, అలాగే ప్రతి నెల ఒకటో తేదీన అవ్వాతాతలకు, దివ్యాంగులకు, వితంతువుల ఇంటికే వెళ్లి పింఛను ఇవ్వడం గొప్ప విషయమని గుర్తు చేశారు. దాదాపుగా 25 సంక్షేమ పథకాల లబ్ధి విషయంలో ప్రభుత్వం తరఫున రాజకీయాలకు అతీతంగా అర్హుల ఎంపికలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలంతా వలంటీర్లకు బాగా కనెక్ట్ అయ్యారని, గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్నప్పుడు చూశామని, మంచిగా సేవ చేస్తేనే ఈ గుర్తింపు వస్తుందన్నారు. అంతకుముందు విజయవాడలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రసంగాన్ని అంతా వీక్షించారు. సీఎం ప్రసంగం ముగియగానే స్థానికంగా ఎంపికైన కొందరికి సత్కరించి ఈ పది రోజల పాటు కొనసాగే 'వలంటీర్లకు వందనం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలో స్థానిక వార్డు వలంటీర్లు ఎం.సురేష్ (కాకివీధి), శరణ్య (గుజరాతిపేట), దివ్యజ్యోతి (డీసీసీబీ కాలనీ), దివ్వల నీలిమ (గొంటివీధి), డి.రామలక్ష్మి (హెచ్‌బీఓ ఏరియా), జె.సరస్వతి (బాకర్‌సాహెబ్ పేట), దీర్ఘాసి భాస్కరరావు (వెలమవీధి–అరసవల్లి), డి.సుష్మ (కంపోస్ట్ కాలనీ), రాగోలు శ్రీకాంత్ (ఫాజుల్‌బాగ్‌పేట)లతో పాటు శ్రీకాకుళం రూరల్‌కు చెందిన రావాడ లావణ్య, మెండ లావణ్య, గార మండలానికి చెందిన కోటేశ్వరరెడ్డికి మంత్రి శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాన్ని, నగదు బహుమతులను అందజేశారు.

మాట మార్చేది బాబు.. మాట మీద నిలబడే వాడు జగన్

వలంటీర్ల మీద చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఎవరూ మర్చిపోరని ధర్మాన గుర్తు చేశారు. ఒకసారి వారిపై దుర్భాషలాడి ఇప్పుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని అంటున్నారని అన్నారు. మాట మార్చే అలవాటు చంద్రబాబు సొంతమైతే.. ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చడం మన సీఎం జగన్ నైజమని అన్నారు. వలంటీర్లను సత్కరించడం ప్రభుత్వం చేస్తున్న మంచి పనుల్లో ఒకటని, సత్కారానికి వలంటీర్లు అర్హులని తెలిపారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో వలంటీర్లు చాల పద్ధతిగా విధులు నిర్వర్తిస్తున్నారని, తాజాగా ప్రతిభ ఆధారంగా చేసిన ఎంపికలో 11,430 మంది వలంటీర్లకు సత్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందులో 11,216 మందికి సేవామిత్ర అవార్డుగా ఒక్కొక్కరికి రూ.10 వేలు, 174 మందికి సేవా రత్నలుగా ఒక్కొక్కరికి మెడల్‌తో పాటు రూ.20 వేలు, 40 మందికి సేవా వజ్ర అవార్డులుగా ఒక్కొక్కరికి రూ.30 వేలతో పాటు మెడల్ ప్రశంసాపత్రాలను అందజేస్తున్నామని ప్రకటించారు. ఈ మేరకు రానున్న 10 రోజుల్లో ప్రతి మండలంలోనూ పండగ వాతావరణంలో ఈ అవార్డుల సత్కార కార్యక్రమాలు ఆయా సచివాలయాల వద్ద నిర్వహించాలని ఆదేశించారు.



హాజరైన వలంటీర్లు

కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, అరసవల్లి ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవి.పద్మావతి, నగర పార్టీ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, శ్రీకాకుళం రూరల్ ఎంపీపీ అంబటి నిర్మలాశ్రీనివాస్, జెడ్పీటీసీ రుప్ప దివ్య, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, సచివాలయ వలంటీర్ల విభాగ నోడల్ అధికారి వాసుదేవరావు, నగర పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు అహంకారపూరితం



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ ఒక యజ్ఞంలా ప్రభుత్వం చేపడుతూ ఉంటే, చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకార పూరిత వైఖరికి నిదర్శనమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు సమాధులు కట్టుకోవడానికా అని దురహంకారంతో మాట్లాడడం సబబు కాదన్నారు. చల్లవానిపేట జగనన్న కాలనీ వద్ద శుక్రవారం పార్టీ శ్రేణులతో కలిసి ఆయన చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఆనాడు వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరు లక్షల ఎకరాలను నిరుపేద మహిళలకు అందించారని, మళ్లీ వైఎస్ జగన్ పేద మహిళలకు 32 లక్షల పైచిలుకు ఇళ్ల పట్టాలు అందించారని తెలిపారు. టీడీపీ హయాంలో ఒక్క సెంటు భూమినైనా ఇవ్వని చంద్రబాబు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

టీడీపీకి సమాధి ఖాయం

త్వరలోనే రాష్ట్ర ప్రజలు టీడీపీకి సమాధి కట్టడం ఖాయమని ఆయన అన్నారు. లోకేష్ యాత్రకు జనాలు రాకపోగా.. వారి కార్యకర్తలే కొట్టుకుంటున్నారని చురకలు అంటించారు. చంద్రబాబు తీరు మార్చుకోకపోతే ప్రజలే ఆయనకు రాజకీయ సమాధి కడతారని అన్నారు. చంద్రబాబు ఎన్ని లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నా మళ్లీ వైఎస్ జగన్‌దే గెలుప ని ధీమా వ్యక్తం చేశారు. ఆయనతోపాటు ఎంపీపీ వాన గోపి, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, మండల సలహాదారు పైడి విఠలరావు, చల్లవానిపేట, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు పి.రాజప్పలనాయుడు, ఎం.శ్యామలరావు, వైస్ ఎంపీపీలు డో ల నాగరత్నం, తంగి మురళీ కృష్ణ, వ్యవసాయ సల హా మండలి అధ్యక్షుడు బుక్కా లక్ష్మణరావు, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షులు దామ మన్మధరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ గంజాయ్

- పట్టుబడిన ముఠాలో టీడీపీ నాయకుడి కొడుకు
- విక్రయాల గుట్టు ఛేదించిన మందస పోలీసులు
- రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన గంజాయి బ్యాచ్
- పలాస నియోజకవర్గంలో సంచలనమైన టీడీపీ నాయకుడి కుమారుడి బాగోతం



మందస పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



బమ్మిడి తేజ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆంధ్రప్రదేశ్‌లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నాయంటూ టీడీపీ ప్రధాన కార్యదర్శి, చంద్రబాబు పుత్రుడు నారా లోకేష్ ఇటీవల ఏకంగా ప్రధానికి ఫిర్యాదు చేశారు. పలు కథనాలను కూడా ఫిర్యాదుకు జత చేశారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టీడీపీ నాయకులకే ఆ గంజాయితో లింకులు ఉండటంతో వరుసగా పట్టుబడుతున్నారు. ఇటీవల కాలంలో రాష్ట్రంలో పలుచోట్ల గంజాయితో టీడీపీ నాయకులు పట్టుబడ్డారు. తాజాగా మందస మండలంలోని అంబుగాంలో గంజాయి వ్యాపారం చేస్తున్న టీడీపీ నాయకుడు బాగోతం బయటపడింది. గంజాయిను పట్టుకుంటే టీడీపీ నాయకుడి గుట్టు రట్టయ్యింది. వాస్తవానికి గంజాయి సాగు, అక్రమ రవాణాపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యుద్ధం ప్రకటించింది. ఆపరేషన్ పరివర్తన్ పేరుతో రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చేందుకు నడుం బిగించింది. ఆ దిశగా యంత్రాంగం దాడులు, ఆకస్మిక తనిఖీలు చేస్తుంటే గంజాయి డెన్‌లో టీడీపీ నాయకుల ప్రమేయం వెలుగు చూస్తోంది.

రహస్యంగా సాగుతున్న గంజాయి వ్యాపారం గుట్టును తాజాగా మందస పోలీసులు ఛేదించారు. పక్కా సమాచారం, ప్రణాళికతో మందస ఎస్ఐ ఎనుకోటి రవికుమార్ ఆధ్వర్యంలో దాడులు చేసి, నిందితులను పట్టుకున్నారు. ఈ ముఠాలో మందస మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కూడా ఉన్నాడు. మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామ సుందర్ శివాజీ అనుచరుడు, మందస మండలంలోని మఖరజోల గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ బమ్మిడి కర్రయ్య కుమారుడైన బమ్మిడి తేజ ఈ గంజాయి ముఠా సభ్యుడిగా పోలీసులు గుర్తించారు. వాస్తవంగా మందస మండలంలోని అంబుగాం గ్రామంలో ఎప్పటి నుంచో గంజాయి వ్యాపారం రహస్యంగా సాగుతోంది. పోలీసుల కన్ను గప్పి ఒడిశా, ఆంధ్రాలకు చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నట్టుగా సమాచారం ఉంది. దీనిపై పక్కా నిఘా పెట్టిన మందస ఎస్ఐ రవికుమార్ పథకం ప్రకారం దాడులు చేసి ముఠాను పట్టుకున్నారు.

అంబుగాం గ్రామానికి చెందిన మజ్జి హరికృష్ణ ఒడిశా నుంచి గంజాయి తీసుకు వచ్చి.. ఈ ప్రాంతంలో విక్రయాలు చేస్తున్నాడు. టీడీపీ నాయకుడు బమ్మిడి తేజతో పాటు వజ్రపుకొత్తూరు మండలానికి చెందిన బెహరా చింతామణి, ముడ్డల చక్రి, పలాసకు చెందిన తంగుడు అవినాష్, కె.హేమంత్, ఒడిశాకు చెందిన సునీల్, ప్రకాశం జిల్లాకు చెందిన సందీప్‌లు ముఠాగా ఏర్పడి గంజాయి వ్యాపారం చేస్తున్నారు. కొంతకాలంగా సాగుతున్న ఈ వ్యాపారంపై మందస పోలీసులకు పక్కా సమాచారం అందడంతో దాడి చేశారు. దీంతో అంబుగాం శివాలయం వద్ద రెడ్ హ్యాండెడ్‌గా హరికృష్ణ, చింతామణి, చక్రి, అవినాష్, హేమంత్, తేజ, ఢిల్లేశ్వరరావులు దొరికిపోయారు. వీరి వద్ద నుంచి 24.7కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రవికుమార్ చెప్పారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న ఒడిశాకు చెందిన విక్రం, ప్రకాశం జిల్లాకు చెందిన సునీల్ పరారయ్యారు. వీరిద్దర్నీ కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. నిందితులను శ్రీకాకుళంలోని ఎక్సైజ్ కోర్టుకు తరలించగా, 14 రోజుల పాటు రిమాండ్ విధించారని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఎన్నడూలేని విధంగా గంజాయి వ్యాపారంలో పలువురు అరెస్ట్ కావడం, అందులో టీడీపీ నాయకుడు కొడుకు ఉండటం మందసలో సంచలనంగా మారింది.

పది నిమిషాల్లో వివాహ ధ్రువీకరణ పత్రం



వెంకటరావుకు వివాహ ధ్రువీకరణ పత్రం అందిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద పద్మాపురం సచివాలయంలో గ్రామానికి చెందిన వెంకటరావు వివాహ ధ్రువీకరణ పత్రం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. సచివాలయంలో కేవలం పది నిమిషాల్లోనే ఆయనకు సర్టిఫికెట్‌ను అందజేశారు. దీంతో కార్యదర్శి అప్పారావు, డిజిటల్ అసిస్టెంట్ దిలీప్‌లను గ్రామంలో పలువురు అభినందించారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుచేసిన తర్వాత ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని కార్యదర్శి అప్పారావు తెలిపారు. ఆధార్ నవీకరణలో దిలీప్‌కు రాష్ట్రంలోనే మొదటిస్థానం లభించిన విషయాన్ని గుర్తుచేశారు.

సమన్వయంతోనే సంక్షేమం

- అభివృద్ధిని విస్తృతం చేయాలి
- వేసవిలో నీటి ఎద్దడి ఉండకూడదు
- టెన్త్‌లో విజేతలను సత్కరిస్తాం
- స్థాయీ సంఘ సమావేశాల్లో జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ


సమీక్షిస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ, పక్కనే సీఈఓ వెంకట్రామన్

అరసవల్లి: ప్రజా ప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం ఉంటే సంక్షేమం సాధ్యమవుతుందని, అంతా కలిసి పనిచేసి అభివృద్ధిని విస్తృతం చేయాలని జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆకాంక్షించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో గ్రామీణాభివృద్ధి (2వ), విద్య, వైద్య కమిటీ (4వ), పనుల స్థాయీ కమిటీ (7వ), ప్రణాళిక, ఆర్థిక (1వ) సంఘ సమావేశాలకు జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షత వహించగా, వ్యవసాయ స్థాయీ కమిటి (3వ) సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, స్త్రీ శిశు సంక్షేమ స్థాయి (5వ) సంఘ సమావేశానికి వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అధ్యక్షత వహించి ఆయా శాఖల ప్రగతిపై సమీక్షించారు. సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘ (6వ) సమావేశానికి కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లుగా జెడ్పీ అధికారులు తెలియజేశారు.

అంతకుముందు ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి పనులు, విద్యాశాఖ, ఇరిగేషన్, విద్యుత్, వైద్యారోగ్య శాఖ, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల పనితీరుపై పిరియా విజయ సమీక్షించారు. ఉపాధి వేతనదారులకు పనుల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. వడదెబ్బల విషయంలో వైద్యారోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలోనూ మందులు ఉండాలని ఆదేశించారు. వైద్యులపై ఫిర్యాదులు వస్తే తగిన రీతిలో స్పందించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనురాధకు సూచించారు.

శ్రీకాకుళం–ఆమదాలవలస ప్రధాన రహదారి విస్తరణ పనుల అడ్డంకులను తొలగించి వేగంగా పనులు పూర్తి చేయించాలని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కాంతిమతికి ఆదేశించారు. అలాగే హిరమండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం కళాశాల ప్రాంగణంలో మంచినీటి కుళాయిని అత్యంత ప్రాధాన్యత క్రమంగా ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసప్రసాద్‌ను ఆదేశించారు. అలాగే జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ అతిథి ధిగ్గృహం మరమ్మతులతో పాటు నిర్వహణ బాధ్యతలను బీఓటీ (బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్) విధానంలో ఆసక్తి గల ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నామని, ఈ మేరకు త్వరలో తీర్మానం చేస్తామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, సీఈఓ ఆర్.వెంకట్‌రామన్ సంయుక్తంగా ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జెడ్పీ ఏఓ రామేశ్వరరావు, విద్యుత్ శాఖ టెక్నికల్ ఈఈ ఎల్‌సీహెచ్ పాత్రుడు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓపై ఆగ్రహం

డీఈఓగా బాధ్యతలు స్వీకరించి చాలా రోజులవుతున్నా తనను కలవకపోవడంపై జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ డీఈఓ తిరుమల చైతన్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హిరమండలంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్యక్రమానికి అక్కటి టీడీపీ నేతలు పిలిపించడంపై ప్రశ్నించారు. కనీసం లోకల్ ఎమ్మెల్యేకు కూడా చెప్పకుండా కార్యక్రమం చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. నాడు–నేడులో అభివృద్ధి చెందిన పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని, జగనన్న విద్యాకానుకగా ఇచ్చే కిట్లలో బ్యాగ్‌తో సహా అన్ని వస్తువులు కచ్చితంగా నాణ్యతగా ఉండాలని చెప్పారు. అలాగే పిల్లలకు ఇచ్చే మూడు జతల యూనిఫారాల కుట్టుకూలీలు పక్కాగా అందరి తల్లుల అకౌంట్లకు జమ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. గడపగడపకూ వెళ్తుంటే చాలా మంది పిల్లలు తమకు బ్యాగులు అందలేదని చెబుతున్నారని, ఈసారి అలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు.

- జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ జిల్లా పరిషత్‌తో పాటు అన్ని మండల పరిషత్ సమావేశాలకు ఆయా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, గైర్హాజరైన వివరాలను పంపిస్తే..చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు. అలాగే దివ్యాంగులకు సదరం సర్టిఫికేట్ల జారీలో ఫిర్యాదులు వస్తున్నాయని, రిమ్స్ వైద్యులు దీనిపై దృష్టి పెట్టాలన్నారు.
- జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ వేసవి ఎండల దృష్ట్యా వేతనదారుల పనివేళలు 6 గంటల నుంచి 4 గంటల వరకు కుదిస్తున్నామన్నారు.
- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్య విషయంలో చిన్నపాటి చర్చల కారణంగా జిల్లాలో జలజీవన్ మిషన్ మందకొడిగా పనులు సాగుతున్నాయని, త్వరలోనే నాబార్డు నుంచి రూ.600 కోట్లు వరకు నిధులు రానున్నాయని, అనంతరం జల్‌జీవన్‌మిషన్ పనులు జిల్లాలో పూర్తి చేస్తామన్నారు.
- కొత్త ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రత్యేకంగా యాప్ అందుబాటులోకి వచ్చిందని హౌసింగ్ పీడీ విద్యాసాగర్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద జిల్లాలో ఈ యాప్‌ను అమలు చేయనున్నారని ప్రకటించారు.
- జిల్లాలో పదోతరగతిలో అద్భుత ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు దక్కించుకున్నారని, రాష్ట్రంలో రెండో స్థానం రావడం సంతోషకరమని, పదిలో అద్భుత ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రభుత్వం తరఫున సత్కరిస్తామని డీఈఓ తెలిపారు.
- 3వ స్థాయీ సంఘ సమావేశంలో భాగంగా జీడి రైతుల సమస్య మార్కెటింగ్ శాఖ సమీక్షలో చర్చకు వచ్చింది. 3వ స్థాయీ సంఘ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి మాట్లాడుతూ..ప్రస్తుత మార్కెట్‌లో 80 కేజీల జీడి బస్తా రూ.7500 వరకు ఉందని, జీడి రైతులకు మద్దతుగా ఉండేలా రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు బస్తా ధర ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు.

క్లుప్తంగా

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌పై మంత్రి సమీక్ష


ఏఐ, పీడీ ఇన్సెంటివ్ చెక్‌ను అందజేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: రాష్ట్రీయ గోకుల్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఏఐపీ–4 సమీక్ష సమావేశాన్ని మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం రాత్రి పలాసలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. కృత్రిమ గర్భధారణపై మరింత అవగాహన కల్పించాలన్నారు. మేలు జాతి ఆడ దూడల ఉత్పత్తిలో అభివృద్ధి సాధించాలని సూచించారు. దేశంలోనే మన రాష్ట్రంలో ఇరవై వేల పశువులకు లింగ నిర్ధారిత వీర్యాన్ని చేర్చారని వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఏఐపీ–4 ప్రోగ్రామ్‌లో శ్రీకాకుళం జిల్లాలోని ఏఐ టెక్నీషియన్లు ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంఘం వారు విడుదల చేసిన ఏఐ, పీడీ ఇన్సెంటివ్ రూ.41,89,050ల చెక్‌ను అందజేశారు.

‘శిక్షణ వినియోగించుకోండి’


ధ్రువీకరణ పత్రాలతో విద్యార్థులు, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు, నిరుద్యోగ యువత పొందుతున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కేఏస్ శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్కిల్ హబ్‌లో స్వల్పకాలిక శిక్షణలు పూర్తిచేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణను 30 మంది పూర్తి చేశారు. మూడు నెలల శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు సైతం కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

అరటి పంటకు తీవ్ర నష్టం


బూరవెల్లిలో అరటి తోటలను పరిశీలిస్తున్న దృశ్యం

గార: జిల్లాలో రెండు రోజుల కిందట వీచిన భీకర గాలులకు అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రాష్ట్ర అగ్రిమిషన్ మెంబర్ గొండు రఘురామ్, ఉద్యానవన శాఖ ఏడీ పి.ప్రసాద్ అన్నారు. వారు శుక్రవారం ఉదయం మండలంలోని బూరవెల్లి, అంబళ్లవలస, శాలిహుండం తదితర ప్రాంతాల్లోని పాడైన అరటి తోటలను రైతులతో కలసి పరిశీలించారు. ఏడీ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో 165 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా నిర్ధారణ జరిగిందన్నారు. గార మండలంలో ఒక్క అరటి పంట సుమారు 80 ఎకరాలు ఉందని, అదేవిధంగా టెక్కలి, జి.సిగడాం, నరసన్నపేట మండలాల్లో అరటి పంటతో పాటు బొప్పాయి, కర్బూజా పంట కూడా నష్టపోయిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అరవల అప్పారావు, మళ్ల నారాయణమూర్తి, అరవల రామారావు, చింతల గడ్డెయ్య తదితరులున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై డ్వామా పీడీ విచారణ

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం–1 ఫీల్డ్ అసిస్టెంట్ బగాది తేజేశ్వరరావుపై డ్వామా పీడీ చిట్టిరాజు శుక్రవారం విచారణ చేపట్టారు. స్థానిక సచివాలయంలో పెద్దహరిశ్చంద్రపురం, వింజాంపాడు, సాలిపేట ఉపాధి హామీ వేతనదారులు, గ్రామస్తులతో విచారణ చేశారు. ఇటీవల గ్రామస్తులు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదుచేయడంతో ఈ దర్యాప్తు నిర్వహించినట్లు పీడీ తెలిపారు. పలువురు వేతనదారులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంటు రికార్డు చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల డ్వామా ఏపీడీ లోకేశ్వరరావు, డ్వామా జేఈ హరిప్రసాద్ పాల్గొన్నారు.

కూతురే కొడుకుగా మారి..


తండ్రి అంత్యక్రియల్లో కుమార్తె

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని బైరి గ్రామానికి చెందిన బైరి ఈశ్వరమ్మ తన తండ్రి మద్దు బాలయ్యకు శుక్రవారం తలకొరివి పెట్టింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. మద్దు బాలయ్య (95) అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈయనకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆస్తి తగాదాల కారణంగా కుమారుడు పాతికేళ్లుగా తండ్రికి దూరంగానే ఉన్నారు. అప్పటి నుంచి బాలయ్య తన కుమార్తె ఈశ్వరమ్మతోపాటే ఉంటున్నారు. అయితే కొడుకు చివరి చూపునకు కూడా రాకపోవడంతో కూతురే తలకొరివి పెట్టింది.

స్కూల్ అసిస్టెంట్ టు పీజీటీ


సర్టిఫికెట్ల పరిశీలన జరగనున్న శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సబ్జెక్టు	భర్తీ చేసే పోస్టులు	దరఖాస్తు చేసుకున్న ఎస్‌ఏలు
తెలుగు	6	32
ఇంగ్లీషు	6	29
మ్యాథ్స్	6	26
ఫిజిక్స్	6	19
కెమిస్ట్రీ	6	13
బోటనీ	6	15
జువాలజీ	6	13
మొత్తం	42	147

- సర్కారీ బడుల్లో హైస్కూల్ ప్లస్ పేరిట ఇంటర్మీడియెట్ కోర్సులు
- ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఎస్‌ఏలను పీజీటీలుగా నియమించడానికి చర్యలు
- జిల్లాలో అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో 42 పీజీటీ పోస్టుల భర్తీ

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అధిక సంఖ్యలో విద్యార్థులు కలిగిన పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా మార్చుతూ.. ఆ పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సులను ఆ ఏడాది మొదలుపెట్టనున్నారు. ఈ పాఠశాలల్లో బోధన కోసం పీజీటీల(పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్) నియామకాలను పూర్తి చేయనున్నారు. ఇందుకోసం పీజీ విద్యార్హతతో పాటు సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులనే పీజీటీలుగా నియమించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో 42 పోస్టులకుగాను ఔత్సాహిక ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను కూడా స్వీకరించింది. వివిధ సబ్జెక్టులకు కలిపి మొత్తం 147 మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేడు శ్రీకాకుళంలో సర్టిఫికెట్ల పరిశీలన

హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీటీలుగా నియామకం పొందేందుకు తగు అర్హత, ఆసక్తి సీనియారిటీ కలిగిన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 20న ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వేదికగా సర్వీస్ రిజిస్టర్‌తోపాటు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్క్రూటినీ కోసం ప్రత్యేకంగా కమిటీలను నియమించారు.

జిల్లాలో ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలలు..

జిల్లాలో ఉర్లాం, హరిపురం, రొట్టవలస, వజ్రపుకొత్తూరు, బ్రాహ్మణతర్ల, టెక్కలి (బాలికలు)జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్ బడులుగా మార్చారు.

ఈ ఆరు హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో పీజీటీ పోస్టులను భర్తీ చేయనున్నారు. మరోపక్క హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పీజీ టీ పోస్టులను అర్హత కలిగిన నిరుద్యోగ అభ్యర్థులతో భర్తీ చేసి ఉద్యోగావకాశాలను కల్పించాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

42 పీజీటీ పోస్టులు భర్తీ..

జిల్లాలో హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో ఏడు సబ్జెక్టుల్లో కలిపి మొత్తం 42 పీజీటీ పోస్టులను అర్హులైన, సీనియారిటీ కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయనున్నారు. వీటికి ఇప్పటికే దరఖాస్తులను ఆహ్వానించగా 147 మంది ఎస్‌ఏలు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా తెలుగు పోస్టులకు 32 మంది, ఇంగ్లిష్‌కు 29 మంది దరఖాస్తు చేయగా, అత్యల్పంగా జువాలజీ, కెమిస్ట్రీకి 13 మందేసి చొప్పున దరఖాస్తు చేసుకున్నారు.

పారదర్శకంగా భర్తీ చేస్తాం..

సీనియారిటీ జాబితా ప్రకారం పారదర్శకంగా పీజీటీ పోస్టులను భర్తీ చేస్తాం. హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మరింత నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. దరఖాస్తు చేసుకుని ఉండి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు తమ సర్వీస్ రిజిస్టర్, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేడు శ్రీకాకుళం బాయ్స్ హైస్కూల్‌కు చేరుకోవాలి.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

ప్రత్యామ్నాయ పంటలు చూపండి: ధర్మాన


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు లాభసాటిగా ఉండేలా అధికారులు ప్రత్యామ్నాయ పంటలను చూపించాలని రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. వరి సాగుకే చాలా మంది రైతులు పరిమితమయ్యారని, నువ్వు, మొక్కజొన్న, మినుములు, పెసర, శనగ వంటి ఇతర పంటల వైపు దృష్టి సారించేలా చైతన్యపరచాలన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నీటి పారుదల సలహా మండలి 29వ సమావేశం, వ్యవసాయ సలహా మండలి సమావేశాలు మంత్రి అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందుగానే అవసరమైన ఎరువులను, విత్తనాలను సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ఆర్‌బీకేలకు ఎరువులు పంపించామని చెప్పారు. గత ఏడాది వ్యవసాయ అధికారులు వేసిన అంచనాలు సత్ఫలితాలను ఇచ్చాయని, ఇందుకు వ్యవసాయ అధికారులను అభినందిస్తున్నట్లు మంత్రి చెప్పారు. సకాలంలో రైతులు దిగుబడి సాధించడమే కాకుండా, వాటిని ప్రభుత్వమే కొనుగోలు చేసిందన్నారు. ఇలాంటి ప్రక్రియ గత 80 ఏళ్లలో ఎప్పుడూ జరగలేదని తెలిపారు.

అనంతరం నీటిపారుదల మండలి గురించి మాట్లాడుతూ వంశధార జలాశయం నిర్మించి సుమారు 50 ఏళ్లు పైబడినందున సహజంగా కొన్ని కట్టడాలు, కాలువలు దెబ్బతిన్నాయని తెలిపారు. వాటికి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉందని, అయితే ఈ సీజనుకు అవసరమైన నీటిని విడిచిపెట్టేందుకు దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వర్షం కూడా సకాలంలో రావడం, తదుపరి రబీలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జిల్లాలో తొలిసారిగా జరిగిందని చెప్పారు. వచ్చే ఏడాది ఇంకా దీన్ని విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.

సమావేశంలో మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా నీటిపారుదల సలహా మండలి చైర్ పర్సన్ చల్లా అలివేలుమంగ, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సలహా మండలి సభ్యులు గొండు రఘురామ్, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, డీసీసీబీ అధ్యక్షులు కరిమి రాజేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె శ్రీధర్, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్ లక్ష్మీ ప్రసన్న, డ్వామా పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన


సదస్సును ప్రారంభిస్తున్న గజపతిరావు

పర్లాకిమిడి: డ్రోన్ల వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందని వక్తలు పేర్కొన్నారు. ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీలో వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్లు వినియోగం, హైబ్రిడ్ విత్తనాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హైబ్రిడ్ మొక్కజొన్న, ఆర్.ఎస్.ఆర్.(డయాబెటిక్) విత్తనాల వినియోగం ద్వారా మంచి లాభాలు పొందవచ్చన్నారు. అంతకుముందు ఈ సదస్సును ఆర్.ఎం.సి.ఎస్.అధ్యక్షుడు ఎస్.గజపతిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వర్సిటీ గెస్ట్ అధ్యాపకులు, మాజీ సంచాలకులు (అగ్రికల్చర్) ఎం.చంద్రశేఖర్‌రావు, ఎంఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ స్కూల్ అధ్యాపకుడు జె.అనిల్‌కుమార్, ఒర్మాస్ హెడ్ డాక్టర్ ప్రియంవద, రాయఘడ సమితి జెడ్పీటీసీ పి.పీతాంబర్ నాయక్, జిల్లా రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ పట్నాయక్, గుసాని సమితి అధ్యక్షుడు ఎస్.వీర్రాజు, సెంచూరియన్ రిజిస్ట్రార్ డాక్టర్ అనితా పాత్ర్, శ్రీకాకుళం, పరిసర గ్రామాల నుంచి 200మంది రైతులు పాల్గొన్నారు.

నీలమణి దుర్గమ్మ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణి దుర్గ ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు ఉత్సవాలను నిర్వహించడానికి కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పట్టణంలోని అన్ని వీధులకు కమిటీలను నియమించి, విద్యుత్ అలంకరణ, పూజా కమిటీలను ఏర్పాటు చేసు కున్నారు. ఒక వైపు డెకరేషన్‌తో పాటు ప్రధాన కూడల్లో విద్యుత్ దీపాలంకరణ పనులు కొనసాగుతున్నాయి. మరో వైపు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నారు. యరుకోల కాంప్లెక్స్‌లో ఎగ్జిబిషన్‌లో భాగంగా రంగులరాట్నం, మినీ ట్రైన్, బిగ్ ట్రైన్, సొలంబో తదితర ఈవెంట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగలకు లక్షలాదిమంది భక్తులు రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఆలయ కమిటీ, పోలీసులు అధికారులు చర్యలు చేపట్టారు.

రెండో దశ పరీక్షలకు హాల్ టిక్కెట్లు సిద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐఐటీ, నీట్ మెడికల్ అకడమిక్‌లో అడ్మిషన్ల కోసం మే 21న పరీక్ష జరగనుందని, ఆ హాల్ టికెట్లను తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల జిల్లా కోఆర్డినేటర్ జి.గ్రేస్ తెలిపారు. 2వ దశ పరీక్షకు రూ. 100 చెల్లించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 8309446784, 9701736862, 7569788629 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


మరణించిన సీపాన విజయ్‌కుమార్

మందస: మండలంలోని బాలిగాం గ్రామానికి చెందిన సీపాన విజయ్‌కుమార్(35) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. విజయకుమార్ మద్యానికి బానిసై నిత్యం కుటుంబంతో గొడవ పడుతుండేవాడు. వేకువజామున ఇంటిలోనే ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చూసి హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం హరిపురం సీహెచ్‌సీలోనే జరిగింది. మృతునికి భార్య అంజలి, కుమారుడు హర్ష ఉన్నారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి వేతనదారుకు పాముకాటు


వేతనదారు సింహాద్రిని పరామర్శిస్తున్న అప్పలరాజు

నరసన్నపేట: మండలంలోని నడగాంకు చెందిన ఉపాధి వేతనదారు తియ్యార సింహాద్రి శుక్రవారం ఉపాధి పనిచేస్తుండగా పాము కాటు వేసింది. గ్రామ సమీపంలోని చిన్న కర్ర బట్టిలో ఉపాధి పనిచేస్తుండగా చేతి వేళ్ల, మండపై పాము కరిచింది. వెంటనే అప్రమత్తమైన తోటి వేతనదారులు ఆయనను నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని, 24 గంటలు పరిశీలనలో ఉంచుతున్నట్లు తెలిపారు. సింహాద్రిని ఉపాధి మండల ఇంజనీర్ అప్పలరాజు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.

బులియన్	
విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,800–00
బంగారం(22సి. 10గ్రా.)	56,650–00
వెండి (కిలో)	78,500–00

కోడిగుడ్ల ధరలు	
హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 480.00
విజయనగరం	రూ. 484.00
శ్రీకాకుళం	రూ. 484.00

చికెన్ – బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260